సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 10 । మార్చి । 2025



రంజాన్ స్పెషల్.. హలీరా

ముస్లింలు రంజాన్ ఉపవాస దీక్ష విరమణలో వినియోగించే హలీరా (గంజి)కి చింతలపూడి ప్రాంతం పేర్గాంచింది. 67 ఏళ్లుగా ఇక్కడ హలీరా తయారుచేస్తున్నారు. 8లో ▸



అట్టహాసంగా భీమడోలు జాతర

భీమడోలు గ్రామ దేవతలు శ్రీమద్దిరామమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీగంగానమ్మ జాతర ఉత్సవాలు ఆదివారంతో అట్టహాసంగా ముగిశాయి. భక్తులు పోటెత్తారు. 8లో ▸



	ఇఫ్తార్ సోమవారం (సాయంత్రం)	సహరి మంగళవారం (ఉదయం)
భీమవరం	6.18	4.55
నరసాపురం	6.19	4.53
తాడేపల్లిగూడెం	6.13	5.03

రంజాన్ వేళలు

ఉపాధి ఆడిట్‌లో చేతివాటం

డబ్బులిస్తేనే ఓకే !

- ఆడిట్ అధికారుల అక్రమాలు
- మస్తర్లలో తేడాలంటూ బెదిరింపులు
- ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి సొమ్ముల వసూళ్లు
- మండలానికి రూ.2 లక్షల వరకూ..



తాడేపల్లిగూడెం మండలంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

భీమవరం(ప్రకాశం చౌక్): జాతీయ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి జరుగుతున్న ఆడిట్‌లో అధికారులు చేతివాటం చూపుతున్నారు. ఆడిట్ సక్రమంగా ఉంటేనే ఉద్యోగం లేకపోతే ఇబ్బంది పడతారంటూ ఫీల్డ్ అసిస్టెంట్లను భయపెట్టి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. జిల్లాలో మండలాల వారీగా ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ జరుగుతోంది. మండలానికి ఐదుగురు అధికారుల బృందం చొప్పున ఆడిట్‌కు వెళుతున్నారు. బృందంలో డీఆర్పీ, ఎస్ఆర్పీలతో పాటు మరో ముగ్గురు అధికారులు ఉన్నారు. ప్రస్తుతం ఆయా మండలాల్లో ఏడాది కాలంలో జరిగిన పనులపై 17వ విడత ఆడిట్ చేస్తున్నారు. ప్రధానంగా డీఆర్పీ, ఎస్ఆర్పీలు కీలకంగా వ్యవహరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. జిల్లాలో 20 మండలాలకు గాను 15 మండలాల్లో ఆడిట్ పూర్తయ్యింది. ఆడిట్ జరిగిన కొన్ని మండలాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లను బెదిరించి మండల స్థాయి ఉపాధి హామీ పథకం అధికారుల సహకారంతో ఆడిట్ అధికారులు భారీగా వసూళ్లు చేసినట్టు తెలిసింది.

మస్తర్లలో తేడాలు, కొట్టివేతలు సాకుగా.

గ్రామాల్లో జరిగిన పనులకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లు వేసిన మస్తర్లలో తేడాలు, కొట్టివేతలు, కూలీల వివరాలు సక్రమంగా లేకపోవడం వంటివి గుర్తించిన అధికారులు వీటిని సాకుగా చూపుతున్నారు. ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు, మండలంలో రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు వసూలు చేసినట్టు సమాచారం. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్లు ఆడిట్ అధికారులకు అడిగినంతా ఇచ్చుకుంటున్నారు. బాధ్యతయుతమైన ఆడిట్ అధికారులే అవినీతికి పాల్పడితే వాస్తవాలు, పనుల్లో అవినీతి ఎలా బయటకు వస్తుందని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

సొంత పనులు చేయిస్తూ..

జిల్లా స్థాయి ఆడిట్ అధికారుల్లో కొందరు, మండల స్థాయి ఉపాధి హామీ పథకం అధికారులు కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లతో వారి సొంత పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్లతో వ్యక్తిగత, ఇంటి పనులు చేయిస్తున్నట్టు తెలిసింది.

ఉన్నతాధికారులు దృష్టి సారించాలి

ఇటీవల జిల్లాలోని కొన్ని పంచాయతీల్లో సెక్రటరీలు రూ.కోట్లలో అవినీతి చేశారు. వారికి కొందరు ఆడిట్ అధికారులు సహకరించినట్టు విచారణల్లో బయటపడగా కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. ఇలాగే ఉపాధి హామీ పథకం ఆడిట్‌లో కూడా అవినీతికి పాల్పడిన అధికారులపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని పలువురు కోరుతున్నారు.

విచారణ చేసి చర్యలు

జిల్లాలో ఏడాది కాలంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి ఆడిట్ జరుగుతోంది. ఆడిట్ అధికారులు సక్రమంగా ఆడిట్ చేశారా లేదా ఎక్కడైనా అవినీతికి పాల్పడ్డారా అనే దానిపై కలెక్టర్ దృష్టికి తీసుకువెళతాం. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విజిలెన్స్ అధికారి ద్వారా విచారణ చేపడతాం. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటాం.

– కేసీహెచ్ అప్పారావు, డ్వామా పీడీ, భీమవరం

కొల్లేరు సరిహద్దుల పరిశీలన



కొల్లేరు అభయారణ్యం హద్దులను పరిశీలిస్తున్న అటవీ దళాధిపతి నాయక్

కైకలూరు/ఏలూరు (ఆర్ఆర్‌పేట): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కొల్లేరు అభయారణ్యం సరిహద్దులను అటవీ శాఖ రాష్ట్ర దళాధిపతి, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఏకే నాయక్, రాజమండ్రి సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బీఎన్ఎన్ మూర్తి ఆదివారం పరిశీలించారు. జిల్లా అటవీశాఖ అధికారి బి.విజయ ఆధ్వర్యంలో ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రు, కలకుర్రు, మాధవాపురం, ప్రత్తికోళ్లలంక పరిసర గ్రామాలు, మండవల్లి మండలం పులపర్రు కొల్లేరు గ్రామాల్లో ప్లస్ 5 కాంటూరు సరిహద్దులను పరిశీలించారు. కొల్లేరు అభ్యయారణ్యం సరిహద్దులపై పూర్తిస్థాయి నివేదికను త్వరలో సుప్రీంకోర్టుకు అందిస్తామన్నారు. అభయారణ్యం ఆక్రమణలకు గురికాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సరిహద్దుల గుర్తింపు దిమ్మల ఏర్పాటుకు కొంత సమయం కావాలని కోర్టును అభ్యర్థిస్తామని చెప్పారు. టెరిటోరియల్ డీఎఫ్ఓ శుభమ్, ఏలూరు రేంజర్ కేపీ రామలింగాచార్యులు, అటవీ శాఖ సిబ్బంది వారి వెంట ఉన్నారు.

న్యూస్‌రీల్

సేవాభావంతో మెలగాలి



కుట్టుమెషీన్ అందిస్తున్న కలెక్టర్ నాగరాణి

ఆకివీడు: ఆపదలో ఉన్న వారిని ఆదుకున్నవాడే దేవుడని, ప్రతి వ్యక్తీ సేవాభావం, మానవతా దృక్పథంతో మెలగాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. స్థానిక లయన్స్ ఆడిటోరియంలో రీజనల్ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించగా ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. సేవా దృక్పథంతో శాంతిని సాధించవచ్చన్నారు. పేదలు 30 మందికి కుట్టుమెషీన్లు, చిరు వ్యాపారులు 50 మందికి గొడుగులు, విద్యార్థులకు 10 సైకిళ్లు, ట్రైసైకిళ్లు, 2 వైండింగ్ మెషీన్లు, గ్రైండర్లను కలెక్టర్ చేతులమీదుగా అందించారు. జిల్లాలోని లయన్స్ మహిళా అధ్యక్షుల్ని సత్కరించారు. లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు, స్క్వాడ్రన్ లీడర్ జయసింహ, వైస్ గవర్నర్ పాపారావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు మీకోసం

భీమవరం (ప్రకాశంచౌక్): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన దృష్ట్యా జిల్లావ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం ఇకపై యథావిధిగా నిర్వహిస్తామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల ప్రధాన కేంద్రాల్లో పీజీఆర్ఎస్‌లో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు.

అపరాల రైతుల నిరసన



జాలిపూడిలో నిరసన తెలుపుతున్న రైతులు

ఏలూరు (టూటౌన్): అపరాలకు కనీస మద్దతు ధర రాక నష్టపోతున్నామంటూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏలూరు రూరల్ మండలం జాలిపూడిలో రైతులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. అపరాల కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరవాలంటూ నినాదాలు చేశారు. రైతు సంఘ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పెసర, మినుములు వంటి అపరాల పంటలకు పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించి వేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు పెసర క్వింటాల్‌కు రూ.8,682, మినుముకు రూ.7,400 రావడం లేదన్నారు. ఈ ఏడాది తెగుళ్లతో దిగుబడులు తగ్గాయని, వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీలపై ఉక్కుపాదం దారుణం

ఏలూరు (టూటౌన్): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సోమవారం విజయవాడలో మహాధర్నా నిర్వహించ తలపెట్టగా ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం తగదని సీఐటీయూ ఏలూరు జిల్లా కమిటీ ధ్వజమెత్తింది. జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. మహాధర్నాకు వెళ్లకుండా నాయకులను నిర్బంధించడం, నోటీసులు ఇవ్వడం, బెదిరించడం మానుకోవాలని హితవు పలికారు. ఎన్నికల ముందు అంగన్‌వాడీల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన చంద్రబాబు వారి సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేయడం అన్యాయమన్నారు.

అక్రమ అరెస్టులు ఆపాలి : అంగన్‌వాడీల ముందస్తు అరెస్టులు నిలిపివేయాలని ఏలూరులో దళిత, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



జిల్లా అధ్యక్షుడు ముదునూరిని కలిసిన మురళీకృష్ణ

నరసాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి, అభివృద్ధికి కృషిచేస్తానని, తనపై నమ్మకంతో కట్టబెట్టిన పదవికి వన్నె తెచ్చేలా పనిచేస్తానని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ జనరల్ సెక్రటరీ దొంగ మురళీకృష్ణ అన్నారు. ఆదివారం నరసాపురంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజును ఆయన మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ పార్టీలో కష్టపడే ప్రతి కార్యకర్తకూ పదవులు వస్తాయని, పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

కాంక్రీట్ లిఫ్ట్ తెగిపడి కానరాని లోకాలకు..

- మహిళా కూలీ దుర్మరణం
- మరో ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



మృతురాలు చింతా రమణమ్మ (ఫైల్)



అపస్మారక స్థితికి చేరిన ఆవుల వెంకన్న



చికిత్స పొందుతున్న బీరా వెంకటేశ్వరరావు

తాడేపల్లిగూడెం అర్బన్: నిర్మాణ భవనానికి శ్లాబ్ వేస్తున్న సమయంలో కాంక్రీట్ లిఫ్ట్ బకెట్ తెగిపడటంతో ఓ మహిళా కూలీ దుర్మరణం చెందగా.. మరో ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలైన సంఘటన తాడేపల్లిగూడెంలోని 5వ వార్డులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని 5వ వార్డులోని రామాలయం వీధిలో ఆదివారం ఓ భవనానికి మూడో అంతస్తు నిర్మాణం కోసం శ్లాబ్ వేస్తున్నారు. జట్లపాలెంలోని గంగిరెడ్డ కాలనీకి చెందిన చింతా రమణమ్మ (30), ఆవుల వెంకన్న, బీరా వెంకటేశ్వరరావు, మరికొందరు కూలీలు పనిచేస్తున్నారు. వీరంతా కింద పనులు చేస్తుండగా కాంక్రీట్‌ను పైకి తరలించే లిఫ్ట్‌కు ఉన్న ఇనుప తీగ తెగిపడటంతో రమణమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. కాంక్రీట్ మోస్తున్న ఆవుల వెంకన్న, బీరా వెంకటేశ్వరరావు తలలకు తీవ్రగాయాలయ్యాయి. వారిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకన్న తలకు బలమైన గాయం కావడంతో కోమాలోకి వెళ్లిపోగా మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వెంకటేశ్వరరావు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రమణమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం, పట్టణ సీఐ ఎ.సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూలి పనులే ఆధారం

మృతురాలు రమణమ్మ, భర్త కోటయ్యలు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రమణమ్మ మృతితో భర్త, పిల్లలు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

భవన యజమానికి కూటమి అండ!

మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు భవన యజమానిని వేడుకోగా తనకు ప్రజాప్రతినిధుల అండదండలున్నాయని, ఏం చేసుకుంటారో చేసుకోండని దురుసుగా మాట్లాడారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యజమానికి కూటమి వర్గానికి చెందిన కొందరు నాయకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. మృతురాలు రమణమ్మ కుటుంబంతో పాటు కోమాలోకి వెళ్లిన వెంకన్న కుటుంబాన్నీ ఆదుకోవాలని కోరుతున్నారు.

నిర్లక్ష్యంతోనే ప్రమాదం

భవన నిర్మాణ ప్రాంతంలో కాంక్రీట్ లిఫ్టును ఇనుప రాడ్లతో పకడ్బందీగా ఏర్పాటుచేయాల్సి ఉంది. అయితే నామమాత్రంగా కర్రలతో కట్టడంతో కర్రలు విరిగి, ఇనుప తీగలు తెగి ప్రమాదం జరిగిందని బంధువులు అంటున్నారు. కాంక్రీట్ లిఫ్టు ఏర్పాటులో నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యువత పోరును జయప్రదం చేద్దాం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి పిలుపు



యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: విద్యార్థులు, నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 12న (బుధవారం) చేపట్టనున్న యువత పోరు ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు పిలుపునిచ్చారు. నరసాపురంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ములు చెల్లించకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ భృతి విషయంలోనూ కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. యువత ఉద్యోగాలు లేక అల్లాడుతుంటే ప్రభుత్వం ప్రచారాలకే పరిమితమైందని మండిపడ్డారు. స్వార్థ ప్రయోజనాల కోసం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారని, అడ్డుకోవాలని కోరారు. నిరుద్యోగ భృతి విషయంలో ప్రభుత్వం స్పందించి ఫీజు బకాయిలు చెల్లించేంత వరకూ వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తోందన్నారు. ఈనెల 12న యువత పోరులో భాగంగా ర్యాలీగా బయలుదేరి భీమవరం కలెక్టరేట్‌కు చేరుకుంటామన్నారు. పార్టీ నాయకులు పీడీ రాజు, పెంద్ర వీరన్న, బందన పూర్ణచంద్రరావు, చినమిల్లి చందు, దొంగ మోహనరావు, బొక్కా రాధాకృష్ణ, తిరుమాని నాగరాజు, కడలి రాంబాబు, పులపర్తి ప్రతాప్, రేవు నారాయణమూర్తి, మైలాబత్తుల శ్రీను, గుబ్బల మోహనరావు, కామన బుజ్జి, దొంగ మురళీకృష్ణ, నల్లిమిల్లి జోసఫ్, కావలి నాని, జేవీఆర్, పప్పుల రామారావు పాల్గొన్నారు.

నేడు జలదుర్గామాత కల్యాణం

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర చివరి దశకు చేరుకుంది. జాతరలో ప్రధాన ఘట్టమైన జలదుర్గా, గోకర్ణేశ్వరస్వామి దివ్య కల్యాణోత్సవం సోమవారం నిర్వహిస్తారు. పెద్దింట్లమ్మ విగ్రహం పక్కన ఉన్న జలదుర్గామాతకు మూడు మైళ్ల దూరంలోని గోకర్ణపురంలో గోకర్ణేశ్వరస్వామితో సోమవారం అర్ధరాత్రి కల్యాణం నిర్వహించనున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా బోనాల సమర్పణ సాయంత్రం ఏర్పాటుచేశారు. జాతరలో భాగంగా ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గుడివాడ శివాని కూచిపూడి నృత్యాలయం వారి కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ఈనెల 13తో జాతర ముగుస్తుందన్నారు. అమ్మవారి కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

లోక్‌అదాలత్‌లో 5,236 కేసుల పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీల్‌కుమార్



ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ, ఏలూరు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 5,236 కేసులను పరిష్కరించినట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఏసీ) ఎం.సునీల్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 26 బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. వీటిలో ఏలూరులో 6, భీమవరంలో 3, కొవ్వూరులో 3, నరసాపురంలో 3, తణుకులో 3, తాడేపల్లిగూడెంలో 3, పాలకొల్లులో 1, నిడదవోలులో 1, జంగారెడ్డిగూడెంలో 1, చింతలపూడిలో 1, భీమడోలులో 1 చొప్పున బెంచీలు ఏర్పాట్లు చేశామన్నారు. మొత్తంగా 4,919 క్రిమినల్ కేసులు, 162 మోటార్ వాహన ప్రమాద బీమా కేసుల్లో సుమారు రూ.11 కోట్లను పరిహారంగా కక్షిదారులకు అందించామన్నారు. 155 సివిల్ కేసులను రాజీ చేయడంతో పాటు 132 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించామన్నారు. ఏలూరులో 1,268, భీమవరంలో 896, చింతలపూడిలో 184, జంగారెడ్డిగూడెంలో 371, కొవ్వూరులో 300, నరసాపురంలో 292, పాలకొల్లులో 176, తాడేపల్లిగూడెంలో 495, తణుకులో 743, నిడదవోలు 465, భీమడోలులో 46 కేసులు పరిష్కరించామని ప్రధాన న్యాయమూర్తి సునీల్‌కుమార్ వివరించారు.

ట్రిపుల్‌ఐటీ.. టెక్‌జైట్‌కు రెడీ

- నేటి నుంచి సాంకేతిక సంబరం
- మూడు రోజులపాటు నిర్వహణ
- సుమారు 10 వేల మంది సందర్శన



నూజివీడు ట్రిపుల్‌ఐటీలోని అకడమిక్ భవనం

నూజివీడు: రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు ట్రిపుల్‌ఐటీలో సోమవారం నుంచి 12 వరకు మూడు రోజుల పాటు జాతీయస్థాయి టెక్నికల్ ఫెస్ట్ 'టెక్‌జైట్-25'ను నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులుగా ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి, ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ఆచార్య ఎం.విజయ్‌కుమార్, నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ హాజరుకానున్నారు. ఫెస్ట్‌ను క్యాంపస్‌లోని స్టూడెంట్ డెవలప్‌మెంట్ క్యాంపస్ యాక్టివిటీ సెల్ (ఎస్‌డీసీఏసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. టెక్‌జైట్‌లో ట్రిపుల్ ఐటీకి చెందిన 8 వేల మందితో పాటు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే 2 వేల మంది మొత్తంగా 10 వేల మంది వరకు విద్యార్థులు పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. గతంలో నిర్వహించిన టెక్‌ఫెస్ట్‌లకు భిన్నంగా నూతన పంథాలో నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద సాంకేతిక ఉత్సవంగా ఇది నిలవనుంది.

సాంకేతిక, పరిశోధన సామర్థ్యాల మెరుగుదల

విద్యార్థుల్లో సాంకేతిక, సృజనాత్మకత పెరగడమే కాకుండా పరిశోధన సామర్థ్యాలు మెరుగుపడేలా టెక్‌ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నారు. కోడింగ్ సవాళ్లు, రోబోటిక్స్ పోటీలు, సర్క్యూట్ డిజైనింగ్, హ్యాకథాన్‌ల వరకు వివిధ సాంకేతిక పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారు. అలాగే పలు రంగాల్లో విశేష అనుభవం కలిగిన వారితో, విజయాలను సాధించిన నిష్ణాతులతో ఇప్పటికే వర్క్‌షాపులను నిర్వహించారు. ట్రిపుల్‌ఐటీలోనే చదువుకుని వివిధ రంగాలలో ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థులతో కూడా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు పోటీలు

ఇంజినీరింగ్ విద్యార్థులకు పలు రకాల పోటీలను ఏర్పాటుచేశారు. మెగా ఎక్స్‌పో, హ్యాకథాన్, వర్క్‌షాప్స్, ఈవెంట్స్, రోబోవార్స్ వంటి పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థుల విజ్ఞానాన్ని, వ్యక్తిత్వం, సమగ్రత, నాయకత్వ లక్షణాలను పెంచడానికి క్విజ్ పోటీలు, ఐపీఎల్ ఆక్షన్, ఫ్రీఫైర్, ఐఏఎస్ పోటీలు టెక్‌జైట్‌లో మరింత ఆకర్షణగా నిలవనున్నాయి. సాంకేతిక రంగంలో వస్తున్న తాజా పురోగతులు, కెరీర్ మార్గదర్శకత్వం, వివిధ రంగాల్లో వస్తున్న నూతన ధోరణులతో సహా పలు రకాల అంశాలు టెక్‌జైట్‌లో ఉన్నాయి.

మెటావర్స్ థీమ్‌తో..

మెటావర్స్ థీమ్‌తో టెక్‌జైట్‌ను నిర్వహిస్తున్నారు. 'నేడు ఉన్న టెక్నాలజీ రేపటికి పాతదైపోతున్న నేటి ఆధునిక యుగంలో రాబోయే రోజులన్నీ ఈ మెటావర్స్‌దే' అన్న ఉద్దేశంతో దీనిని థీమ్‌గా తీసుకున్నారు. విద్యార్థుల్లో ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), వర్చువల్ రియాలిటీ (వీఆర్) గురించి మరింత విజ్ఞానాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ థీమ్‌ను ఎంపిక చేశారు.

హ్యాకథాన్ పోటీలు

టెక్‌జైట్-25లో భాగంగా నూజివీడు ట్రిపుల్‌ఐటీలో ఆదివారం హ్యాకథాన్ పోటీలను డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ ప్రారంభించారు. ఏఐ హ్యాకథాన్ పోటీల్లో 71 జట్లు, రోబోటిక్ హ్యాకథాన్ పోటీల్లో 10 జట్లు పాల్గొంటున్నాయి. ఏఐ హ్యాకథాన్‌లో ఉత్తమ పరిష్కారం కనుగొన్న రెండు జట్లకు రూ.10 వేల చొప్పున, రోబోటిక్ హ్యాకథాన్‌లో ఉత్తమ పరిష్కారం కనుగొన్న జట్టుకు రూ.10 వేల నగదు బహుమతి అందిస్తామని డైరెక్టర్ తెలిపారు. హ్యాకథాన్ పోటీలు సోమవారం మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతాయన్నారు. అనంతరం ఫలితాలను ప్రకటిస్తామని ఏఓ బి.లక్ష్మణరావు తెలిపారు. డీన్ అకడమిక్స్, టెక్‌జైట్-25 కన్వీనర్ చిరంజీవి పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న డైరెక్టర్ అమరేంద్రకుమార్

ఆక్వా రైతుల ఉద్యమ బాట

క్షేత్రస్థాయి నుంచి సంఘటితం కావాలని పిలుపు



ఆకివీడు మండలం చినకాపవరంలో సమావేశమైన ఆక్వా రైతులు

ఆకివీడు: క్షేత్రస్థాయి నుంచి పోరాటాన్ని ఉధృతం చేద్దాం, ఆక్వా పంటను రక్షించుకుందాం అంటూ ఆక్వా రైతులు సమైక్య పోరాటానికి సన్నద్ధమయ్యారు. మండలంలోని చినకాపవరంలో ఆదివారం ఆక్వా రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర సభ్యుడు యువరాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువరాజు మాట్లాడుతూ రైతులు అప్పులు చేసి ఆక్వా సాగు చేస్తున్నారని, రొయ్యల పెంపకం సంతృప్తికరంగా ఉందన్న సమయంలో రొయ్యల ధరల్ని దారుణంగా తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రొయ్య ధరలపై నియంత్రణ లేకపోవడంతో కొనుగోలుదారులు, బ్రోకర్లు ఇష్టారాజ్యంగా రొయ్యల్ని కొనుగోలు చేస్తున్నారని మండిపడ్డారు. రైతులంతా క్షేత్రస్థాయిలో, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసుకుని ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు. విదేశీ మార్కెట్‌లో రొయ్యల ధరలు ఆశాజనకంగా ఉన్నా స్థానిక మార్కెట్‌లో ధరలను తగ్గిస్తున్నారని మండిపడ్డారు. ఆక్వా రైతులు కాకర్ల వినాయక్, మర్రివాడ వెంకట్రావు, కోపల్లె సాయిబాబు, కోపల్లె హనుమ మాట్లాడుతూ రొయ్యల రైతులంతా సంఘంగా ఏర్పడదామని సూచించారు. ప్రతి గ్రామంలో రొయ్య రైతుల వివరాల్ని సేకరించి సంఘటితం చేద్దామన్నారు. రొయ్యల ధరలు తగ్గింపు, మేత ధరల పెంపుపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే ఆకివీడులో భారీ సమావేశం నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. అధిక సంఖ్యలో ఆక్వా రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు


గుబ్బల మంగమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వాహనాలతో తరలి వచ్చి అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చేతల్లిగా వరాలిచ్చే అమ్మగా పేరుపొందడంతో మంగమ్మగుడికి వచ్చే భక్తుల సంఖ్య ప్రతీ వారం పెరుగుతూనే ఉంది.

క్షేత్రంలో కోతులను ఎత్తుకెళ్లిన వ్యక్తులు


బోనులో చిక్కుకున్న కోతులు

ద్వారకాతిరుమల : శ్రీవారి క్షేత్రంలో గుర్తు తెలియని ఒక వ్యక్తి, మహిళ కలిసి ఆదివారం రెండు కోతుల్ని బంధించారు. స్థానికులు ప్రశ్నించడంతో వాటిని తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికుల కథనం ప్రకారం.. ద్వారకాతిరుమల చినవెంకన్న దేవస్థానం పాత కేశఖండనశాల వెనుక రోడ్డులో ఆటోలో బోనును ఏర్పాటు చేసి, అరటి పండ్లను ఎరగా వేసి రెండు కోతుల్ని బంధించారు. మిగిలిన వాటిని పట్టుకునేందుకు ప్రయత్నం చేశారు. స్థానికులు వారిని ఎవరని నిలదీయడంతో హడావుడిగా అక్కడి నుంచి పరారయ్యారు. అసలు కొండముచ్చులను వారు ఎందుకు పట్టుకెళుతున్నారన్నది తెలియలేదు. కోతుల్ని తామేమీ పట్టించలేదని దేవస్థానం, అటవీశాఖ అధికారులు తెలిపారు.

16 టన్నుల ఐరన్ మాయం

దెందులూరు: దెందులూరు హౌసింగ్ గోడౌన్‌లో 16 టన్నుల ఐరన్ మాయమైందని గృహ నిర్మాణ శాఖ డివిజనల్ ఇంజనీర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొవ్వలి వంతెనకు వెళ్లే దారిలో గృహ నిర్మాణ శాఖ గోడౌన్ ఉంది. అయితే అక్కడ ఉన్న 16 టన్నుల ఐరన్ మాయమైందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రంజాన్ స్పెషల్.. హరీరా

- 67 ఏళ్ల నుంచి చింతలపూడి ప్రాంతంలో ప్రసిద్ధి
- హరీరా సేవించి ఉపవాస దీక్ష విరమణ


చింతలపూడి మసీదులో హరీరా తయారీ


ఉపవాస విరమణ సమయంలో హరీరా తాగుతున్న దీక్షాపరులు

చింతలపూడి: ప్రపంచ వ్యాప్తంగా ముస్లిం సోదరులు ఆచరించే ఇస్లాం మార్గదర్శకాల్లో రంజాన్ ఉపవాసాలకు అత్యంత ప్రాధాన్యత ఉంది. రంజాన్ నెలలో 30 రోజుల పాటు కఠోర ఉపవాసాలు ఆచరించడంతో పాటు ఐదు పూటలా ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. నెలవంక దర్శనంతో మరుసటి రోజు నుంచి ప్రారంభమయ్యే రోజా (ఉపవాసాలు) షవ్వాల్ నెలవంక దర్శనంతో ముగుస్తాయి. ప్రతి ముస్లిం నమాజుతో పాటు తప్పని సరిగా ఉపవాసాలు పాటించాలని ఇస్లాం సూచిస్తోంది. తెల్లవారుజామునకు ముందు నుంచే ఉపవాస దీక్ష (సహర్) ప్రారంభమవుతుంది. సూర్యాస్తమయం సమయం (ఇఫ్తార్) వరకు పాటిస్తారు. పగటి సమయమంతా అన్నపానీయాలు, ఆహార పదార్థాలు తీసుకోరు. సాయంత్రం ఇఫ్తార్‌తో దీక్ష విరమిస్తారు. పగలంతా ఉపవాసం పాటించిన దీక్షాపరులు సాయంత్రం నిర్ణీత వేళలో పండ్లు, ఫలహారాలతో దీక్ష విరమిస్తారు. ఈ సందర్భంగా ఇఫ్తార్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. చింతలపూడి ప్రాంతంలో 67 ఏళ్ల క్రితం అప్పటి జమాతే ఇస్లామీ హింద్ నాయకులు బషార్‌తుల్లా హరీరా తయారు చేయడం ప్రారంభించారు. దూరప్రాంతాల నుంచి కూడా వచ్చి ఇక్కడ హరీరా సేవిస్తారు. ఇప్పటికీ రంజాన్ నెలలో హరీరా తయారు చేసి ముస్లిం సోదరులకు అందిస్తారు.

పోషకాలకు నెలవు

ఉపవాస దీక్ష విరమణలో వినియోగించే హరీరా(గంజి)కి ఈ ప్రాంతంలో ఎంతో విశిష్టత ఉంది. గత 67 ఏళ్ళుగా చింతలపూడి హరీరాకు ప్రత్యేక స్థానం ఉంది. రోజంతా ఉపవాసం ఉన్న వాళ్ళు ఈ హరీరా తాగితే తిరిగి శక్తిని పొందవచ్చు. ఇందులో ఉపయోగించే పదార్థాలన్నిటిలో పోషకాలు ఎక్కువగా ఉండటం విశేషం. తక్షణమే శరీరానికి శక్తిని అందిస్తుంది. ఇందులో ఉండే పీచు పదార్థం కారణంగా పొట్ట నిండుగా ఉన్న భావన కలుగుతుంది. ఇందులో ఉపయోగించే మసాలా దినుసులు, డ్రై ఫ్రూట్స్ అధిక రక్తపోటు, మధుమేహంతో బాధపడే వారికి ఉపశమనం కలిగిస్తాయి. హరీరా తయారు చేయడానికి 3 నుంచి 4 గంటల సమయం పడుతుంది. కట్టెల పొయ్యి మీద తయారు చేయడంతో దీని రుచి అద్భుతంగా ఉంటుంది.

తయారీ విధానం

తయారీలో బియ్యం రవ్వ, మటన్ కీమా, నూనె, డాల్డా, అల్లం, వెల్లుల్లి, కొబ్బరి, పుదీనా, కొత్తిమీర, కరివేపాకు, ఉల్లిపాయలు, టమాటా, లవంగాలు, దాల్చిన చెక్క, పెసరపప్పు, కారం వంటి వస్తువులతో చేస్తారు. హలీంకు ఏమాత్రం తీసిపోకుండా రుచికరంగా ఉంటుంది. హరీరా (గంజి) బలవర్ధకమైన పానీయం. దీన్ని తాగితే ఉపవాస దీక్షాపరులకు బలం చేకూరడమే కాక, ఆరోగ్యవంతంగా కూడ ఉంటారని ఇక్కడి ముస్లింలు చెబుతారు. అందుకే ముస్లింలే కాకుండ హిందూ సోదరులు కూడ ఈ హరీరాను సేవించడానికి వస్తుంటారు.

ఐదు దశాబ్దాలుగా..



చింతలపూడి హరీరా ఐదు దశాబ్దాలుగా ఈ ప్రాంత ముస్లింలను అలరిస్తోంది. రంజాన్ వచ్చిందంటే నెల రోజుల పాటు హరీరాకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఆరోగ్య పరంగా కూడ హరీరా మంచి ఆహారం. ఉపవాస దీక్షలో తప్పనిసరిగా ముస్లింలు హరీరా సేవించి దీక్షను విరమిస్తారు. రుచికరంగా ఉండటమే కాక పగలంతా ఉపవాసాలు ఉన్న వారికి శక్తిని ఇచ్చే ఔషధంగా పని చేస్తుంది.

– సయ్యద్ రహీం(బాబు), జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు

రంజాన్ నెలలో స్పెషల్



ప్రతీ సంవత్సరం రంజాన్ నెలలో 30 రోజులపాటు ఉపవాసాలు ఉండి హరీరా సేవించడం ఆరోగ్యానికి మంచిది. రోజంతా ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరులు భగవంతుని కృప కోసం ఇఫ్తార్ సమయంలో హరీరా సేవిస్తారు.

– ఎండీ జిలాని, జామియా మసీదు కమిటీ కార్యదర్శి

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక


లూథరన్ స్కూల్లో 1976-1981 బ్యాచ్ విద్యార్థులు, చిత్రంలో మండలి చైర్మన్ మోషేన్ రాజు

భీమవరం: భీమవరం లూథరన్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు 1976–1981 మధ్య చదివిన ఆనాటి మిత్రుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను, ప్రస్తుత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. తరగతి గదుల్లో కూర్చుని చిన్ననాటి రోజులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహితులు ముగ్గురికి ఆర్థిక సాయం అందించి తమ అనుబంధాన్ని చాటుకున్నారు. ఆనాటి స్నేహితుల్లో ఒకరైన శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు పాల్గొని చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసి అందర్నీ ఆత్మీయంగా పలకరించి సందడి చేశారు. ఆత్మీయ మిత్రుల సమ్మేళనానికి కృషి చేసిన కొప్పర్తి అప్పారావు, బుడెం శ్రీనివాసరావు, కాటం రమేష్, తటవర్తి విశ్వేశ్వరరావు, అడబాల శివను తోటి మిత్రులు అభినందించారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

ముదినేపల్లి రూరల్ : పెళ్లి చేసుకుంటానని నమ్మించి మహిళను మోసం చేసిన ఘటన మండలంలోని కొరగుటపాలెంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మహిళకు 2018లో వివాహం జరిగింది. భర్తతో మనస్పర్థలు రావడంతో గ్రామంలోని తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. కలిదిండి మండలం పోతుమర్రుకు చెందిన యువకుడితో ఆమెకు పరిచయం పెరిగింది. సదరు యువకుడు మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం పెట్టుకున్నాడు. తనను పెళ్ళి ఎప్పుడు చేసుకుంటావని యువకుడిని నిలదీయగా యువకుడితోపాటు అతని బంధువులు తక్కువ కులానికి చెందినదని మహిళను అవమానించడంతో పాటు బెదిరించారు. న్యాయం చేయాలని కోరుతూ మహిళ ఫిర్యాదు చేయగా ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అట్టహాసంగా భీమడోలు జాతర


భీమడోలు జాతరలో కొర్లబండిని లాగుతున్న జనం

భీమడోలు: భీమడోలు గ్రామదేవతలు శ్రీమద్దిరామమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీగంగానమ్మ జాతర ఉత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. గ్రామంలోని పురవీధులు భక్తులతో కిటకిటలాడాయి. 33 రోజులుగా జాతర ఉత్సవాలు సాగాయి. కొర్లబండిని పొలిమేరకు పంపడంతో ఉత్సవాలు ముగిశాయి. శనివారం అర్ధరాత్రి కీలక ఘట్టమైన అమ్మవార్లకు కుంభాభిషేకం పూజలు ప్రారంభించి ఆ తర్వాత పొలిచేట గ్రామ పొలిమేరల్లో తిరిగింది. తెల్లవారుజాము నుంచి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆదివారం ఉదయం అమ్మవార్లకు కుంభం కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయాలు పోటెత్తాయి. అమ్మవార్లకు బూరెలు, గారెలు, అన్నం తదితర నైవేద్యాన్ని సమర్పించి భక్తిని చాటుకున్నారు. జాతర కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో జాతర సమితి, యువకులు, పెద్దలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. భీమడోలు సీఐ యూజే విల్సన్ పర్యవేక్షణలో ఎస్సై వై.సుధాకర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. వరసగా సెలువులు కావడంతో జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఆలయాల వద్ద స్వచ్ఛంద సేవా సంస్థలు, బ్యాంకు యాజమాన్యాలు భక్తులకు మజ్జిగ, నీళ్ల ప్యాకెట్లను అందించాయి. శ్రీకల్కి సేవా సమితి ద్వారా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేయించారు. భీమడోలు గ్రామంలోని ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది. మేళతాళాలు, బాణసంచాతో పాటు చిత్ర విచిత్ర వేషాలతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కొర్ల బండిని గణాచారులు, పెద్దలు, భక్తులు లాగి పొలిమేర వద్దకు పంపారు.


కొర్లబండిలో ఆడవేషంలో పంబలి వాడు


అమ్మవార్లకు కుంభం పోసి పూజలు చేస్తున్న దృశ్యం

సబ్ జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక


అండర్-16 కబడ్డీ బాలికల జట్టుతో వ్యాయామ ఉపాధ్యాయులు

తణుకు అర్బన్: పశ్చిమగోదావరి జిల్లా సబ్ జూనియర్ అండర్–16 బాలురు, బాలికల కబడ్డీ సెలక్షన్స్ తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరుకాగా వారిలో 12 మంది బాలురు, 12 మంది బాలికలను ఎంపిక చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యలమరెడ్డి శ్రీకాంత్ తెలిపారు. ఎంపికైన జట్లు ఈ నెల 14 నుంచి 16 వరకు కడప జిల్లాలోని పులివెందులలో నిర్వహించే 39వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా తరపున ఆడనున్నట్లు ఆర్గనైజర్ సంకు సూర్యనారాయణ తెలిపారు. ముందుగా బాలుర జట్టు ఎంపికను ఏఎంసీ మాజీ చైర్మన్ బసవ రామకృష్ణ, బాలికల జట్టు ఎంపికను తణుకు పట్టణ బీజేపీ అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు ప్రారంభించారు. వ్యాయామ ఉపాధ్యాయులు కె.షణ్ముఖం, కేవీఆర్ సుబ్బారావు, బి.ప్రదీప్, జి.రవి, కే.మంగ, వి.సత్యవేణి, సి.రాణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో పూల సోయగం


డివైడర్‌లో కనువిందు చేస్తున్న పూలు


ఎప్పటికప్పుడు కట్ చేస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రానికి వెళ్లే మార్గం పూల సోయగం. రంగులు అద్దినట్టు పూస్తున్న కాగితం పూలతో రహదారి మధ్యలోని డివైడర్ భక్తులకు, ప్రయాణికులకు కనువిందు చేస్తోంది. ద్వారకాతిరుమల నుంచి లక్ష్మీపురం వరకు సుమారు 2 కిలోమీటర్ల మేర, రహదారి మధ్య డివైడర్‌లో శ్రీవారి దేవస్థానం ఈ పూల మొక్కలు వేసి, సంరక్షిస్తోంది. సిబ్బంది నిత్యం మొక్కలను సమాంతరంగా కట్ చేసి, నీరు పెడుతున్నారు. వాటి పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. డివైడర్ కొంత దూరం తెలుపు పూలు, మరి కొంత దూరం ఎరుపు, గులాబీ రంగు పూలతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. భీమడోలు వైపు నుంచి వచ్చే భక్తులకు ఈ పూల మొక్కలు కనిపించగానే క్షేత్రానికి వచ్చామన్న అనుభూతి కలుగుతోంది.

మార్షల్ ఆర్ట్స్‌లో ప్రపంచ రికార్డు


తణుకు జెడ్పీ బాలుర పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

తణుకు అర్బన్: తణుకు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం చిన్నారులు మార్షల్ ఆర్ట్స్ నాన్ చాక్ తిప్పుతూ వేసిన యోగాసనాలు యునైటెడ్ వరల్డ్ రికార్డును సాధించాయి. కేఎస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ డాక్టర్ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో 250 మంది కరాటే విద్యార్థులు 22 రకాల యోగాసనాలు వేస్తూ మార్షల్ ఆర్ట్స్ నాన్ చాక్ తిప్పుతూ వినూత్నంగా చేసిన ప్రదర్శన అలరించింది. ఈ కార్యక్రమానికి న్యాయనిర్ణేతగా వి.ఆర్యన్ వ్యవహరించారు. ముఖ్య అతిథిగా హాజరైన తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్‌లో చిన్నారులు రాణిస్తున్న తీరు అభినందనీయమని, విద్యతోపాటు క్రీడల్లో కూడా పట్టు సాధించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. క్రీడాకారులను తీర్చిదిద్దుతున్న అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌ను అభినందించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచంలోనే మొదటిసారిగా 250 మంది మార్షల్ ఆర్ట్స్ విన్యాసాల మధ్య యోగాసనాలు వేయడం జరిగిందన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

భీమవరం: భీమవరం రెండో పట్టణం దుర్గాపురానికి చెందిన పి.విజయకుమార్(20) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం మృతుడికి ఆరు నెలల కిందట వివాహమైంది. వేరొకరితో మాట్లాడటంపై భార్య అభ్యంతరం తెలిపి పుట్టింటికి వెళ్లిపోయింది. అత్తింటికి 7న వెళ్లిన విజయకుమార్ 8న ఇంటికి వచ్చి తలుపులు వేసుకున్నాడని, అనుమానం వచ్చి తలుపులు పగటగొట్టి చూసేసరికి కిందపడి అపస్మారక స్థితిలో ఉన్నాడన్నారు. ప్రైవేటు వైద్యుడు వచ్చి పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. చున్నీ మాత్రం ఇంటి శ్లాబుకు ఉన్న ఫ్యాన్ రింగ్ నుంచి కిందకు వేలాడుతుందన్నారు. ఎస్సై ఇజ్రాయేల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ


జంగారెడ్డిగూడెంలో విజేతలతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు, జెట్టి సత్య ఆదిత్య

జంగారెడ్డిగూడెం: జెట్టి సత్యారావు రాష్ట్ర స్థాయి ఫస్ట్ మెమోరియల్ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ 2025 జంగారెడ్డిగూడెంలో ఆదివారం జరిగింది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 220 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్–7, 9, 11, 13, 15 కేటగిరీల్లో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో ఫస్ట్‌ప్రైజ్ రూ.5 వేలు, సెకండ్‌ప్రైజ్ రూ.4 వేలు, థర్డ్ రూ.3 వేలు అందజేశారు. 20 స్థానాలకు క్యాష్ ప్రైజ్, ట్రోఫీలు అందజేశారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పించారు. స్థానిక ప్రతిభ ఇంగ్లీష్ మీడియంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు చేతుల మీదుగా విజేతలు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి దేవరపల్లి లక్ష్మణరావు(ఏలూరు), ద్వితీయ బహుమతి జడల మల్లేశ్వరరావు(విజయవాడ), తృతీయ బహుమతి కొరపర్తి సీతసాగర్ (రాజమండ్రి)కు అందజేశారు. కార్యక్రమంలో జెట్టి సత్యాదిత్య, కాసర సరోజారెడ్డి, కాళ్ళిడి రమేష్, ముప్పిడి శ్రీనివాసరావు, సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతర వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి వనిత


మాజీ మంత్రి వనితకు పసుపు, కుంకుమ అందిస్తున్న మహిళలు

ద్వారకాతిరుమల: భీమడోలులో ఆదివారం జరిగిన జాతర ముగింపు వేడుకల్లో మాజీ హోం మంత్రి తానేటి వనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ద్వారకాతిరుమల మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, గోపాలపురం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దాకారపు బంగారమ్మతో కలసి పసుపులేటి సత్యనారాయణ ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా వనితకు పెద్దిరెడ్డివారి మహిళలు పసుపు, కుంకుమ పెట్టారు. అనంతరం విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, దాసరి రాంబాబు, భోగరాజు సాయికృష్ణ, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, కొల్లి సుబ్బారావు, ఘంటా శ్రీను, దాకారపు అగ్గియ్య తదితరులున్నారు.

పోలీసుల అదుపులో క్రికెట్ బుకీలు

భీమవరం: భారత్– న్యూజిలాండ్ మధ్య ఆదివారం జరిగిన చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌పై బెట్టింగ్‌లు కాస్తున్న పట్టణానికి చెందిన నలుగురు బుకీలను వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పెద్ద మొత్తంలో బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో అదుపులోకి తీసుకున్నారు.

కోకో గింజల చోరీ

టి.నరసాపురం: కోకో గింజలు చోరీకి గురైనట్లు రైతు గోరింట రామవర్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన గోరింట రామవర్మ సింగరాయపాలెం గ్రామ శివారులో పామాయిల్ , కోకో సాగు చేస్తున్నాడు. ఈ నెల 7న కోకో పంట కోసి గింజలు గుట్టలుగా పోసి ఇంటికి వెళ్లాడు. 8న తోటకు వెళ్లి చూడగా, సుమారు 175 కేజీల కోకో గింజలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయినట్లు గుర్తించాడు. ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అడవిలో అగ్ని ప్రమాదం


ఉంగుటూరు అడవిలో మంటలు అదుపుచేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఉంగుటూరు ఏ బ్లాకు రెవెన్యు ఫారెస్టులో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. సుమారు రెండు ఎకరాలు దగ్ధమైంది. ఎవరో సిగరెట్ ఆర్పకుండా పడేయటంతో ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. తాడేపల్లిగూడెం ఫైర్ సిబ్బంది హుటాహుటిన ప్రమాదప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. తహసీల్దారు ప్రసాద్ ప్రమాద ప్రాంతానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. తాడేపల్లిగూడెం ఫైర్ ఆఫీసరు శ్రీశైలం,ఫైర్ సహాయక ఆఫీసరు సాగర్ బాబు, ఫారెస్టు బీటు ఆఫీసరు రాజేష్ తదితరులు మంటలను అదుపు చేయడంలో కృషి చేశారు. కలపకు ఎలాంటి నష్టం జరగలేదని తహసీల్దారు తెలిపారు.

క్లుప్తంగా

ఉద్యాన పంటలపై వర్క్‌షాప్


ఉద్యాన అధికారిణి

తాడేపల్లిగూడెం రూరల్: భీమవరం విష్ణు కళాశాలలో ఈ నెల 12, 13వ తేదీల్లో ఉద్యాన పంటలపై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తాడేపల్లిగూడెం మండల ఉద్యాన శాఖ అధికారిణి శ్రీలక్ష్మి తెలిపారు. ఆదివారం ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 12న పాలి హౌస్, షేడ్‌నెట్ హౌస్‌లో పండించే కూరగాయలు, పూల సాగుపై, 13న కొబ్బరి, కోకో, అరటి విలువ ఆధారిత విధానాలపై రైతులకు శిక్షణనివ్వనున్నట్లు వివరించారు. ఆసక్తి గల రైతులు ముందుగా ఉద్యాన శాఖ అధికారి వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

'పది' విద్యార్థులకు ఆర్టీసీ ప్రయాణం ఉచితం


డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పదో తరగతి పరీక్షలు ఈ నెల 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు వారి హాల్ టికెట్ ఆధారంగా అన్ని పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచితంగా అనుమతించనున్నారని ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. పదో తరగతి విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

23 నుంచి బలుసులమ్మ ఉత్సవాలు


బలుసులమ్మ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ దేవస్థానం ఉగాది మహోత్సవాలు క్రోధినామ సంవత్సరం ఫాల్గుణ బహుళ నవమి 23వ తేదీ ఆదివారం నుంచి విశ్వావసు నామ సంవత్సరం శుక్ల విధియ 31వ తేదీ సోమవారం వరకు నిర్వహించనున్నారు. 23వ తేదీన గోపూజ, గణపతి పూజ, గరగల సంప్రోక్షణ విశేష అర్చనలు, 24వ తేదీ పాతూరు పుట్టింటి పొంగు, 25వ తేదీన విశేష కుంభాభిషేకం, 26వ తేదీ పట్టణ పుర వీధుల్లో అమ్మవారి ఊరేగింపు, 27వ తేదీన చండీ హోమం, 28వ తేదీన సామూహిక కుంకుమ పూజలు, 29వ తేదీన అమ్మవారికి విశేష పుష్పార్చన, 30వ తేదీ ఉగాది సందర్భంగా అమ్మవారి దివ్య మంగళ దర్శనం, 31వ తేదీన అష్టమూర్తి రుద్రాభిషేకం, అదే విధంగా ఏప్రిల్ 4వ తేదీన మహా కుంభనివేదన, 6వ తేదీన ఆలయ శిఖర పూజలతో ఉగాది మహోత్సవాలు పూర్తి చేస్తారు. ఆలయ ఈవో, ఆలయ కమిటీ నిర్వాహకులు కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారు.

ఆదర్శనీయుడు చిట్టూరి


మాజీ ఎమ్మెల్యే చిట్టూరి వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్: మాజీ ఎమ్మెల్యే చిట్టూరి వెంకటేశ్వరావు జీవితం ఆదర్శప్రాయమని, సమాజం వారి సేవలను ఎన్నటికీ మరవదని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం ఇటీవల మరణించిన లయన్స్ క్లబ్ నాయకుడు చిట్టూరి వెంకటేశ్వరావు నివాసానికి వెళ్లిన ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. చిట్టూరి కుటుంబం మొదటి నుంచి సంఘ సేవకు ప్రాధాన్యం ఇచ్చేవారని, వెంకటేశ్వరావు ఆదర్శప్రాయ జీవితాన్ని సాగిస్తూ సమాజానికి ఎంతో సేవ చేశారన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ వంక రాజకుమారి, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, పెండ్యాల సూరిబాబు, చిట్టూరి మెహర్, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య, డాక్టర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

భీమవరం: రాజ్యాంగాన్ని రక్షించుకునే బాధ్యత దళితులపై ఉందని, రాజ్యాంగానికి తూట్లు పొడవడానికి కొన్ని శక్తులు బయలుదేరాయని జాతీయ దళిత నాయకుడు జేబీ రాజు అన్నారు. భీమవరం అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజ్యాంగ రక్షణపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ వాటిని ఎదుర్కొనేందుకు ధైర్యంగా దళిత ఉద్యోగులు, నాయకులు యువకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బి.రత్నప్రదీప్, సలీం రాజు, కేసీ రాజు, శ్రీకర్, గంటా సుందర్ కుమార్, వర్ధనపు రాజేష్, కుమార్‌రాజు, నంది విజయ్ కుమార్, సుదీర్ బాబు, కృష్ణ మోహన్, రాజేష్‌కుమార్, దేవదానం, బండి మధు, బుంగ అధాం, కోనా జోసెఫ్, ఈది రవికుమార్, కమలకర్, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం

- కంపుకొడుతున్న గ్రామాలు
- మరింత అధ్వానంగా దళిత వాడలు
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ
- స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ దివస్ ఎక్కడ


రాచర్ల కుళాయి వద్ద వేసిన చెత్త

పెంటపాడు: క్షీణించిన పారిశుద్ధ్యంతో పల్లెలు సతమతమవుతున్నాయి. మురుగు సమస్యతో అధ్వానంగా తయారయ్యాయి. పట్టణం, పల్లెలకు వచ్చే వారికి చెత్త స్వాగతం పలుకుతోంది. రోడ్ల పక్కన నిలుచునే పరిస్థితి లేని తీరు కలవరపెడుతోంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పట్టించుకోకపోవడంతో దయనీయ స్థితి నెలకొంది. ప్రధాన రహదారుల అంచులను మున్సిపల్, గ్రామ పంచాయతీలు డంపింగ్ యార్డులుగా మార్చేస్తున్నాయి. నియోజకవర్గంలో పట్టణంతో పాటు గ్రామాల్లో రోడ్డు పక్కన చెత్త గుట్టలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయి అడవులను తలపిస్తున్నాయి. దీంతో నియోజకవర్గంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

స్వచ్ఛ సంకల్పానికి తిలోదకాలు

స్వచ్ఛ భారత్ లక్ష్యం నెరవేరడం లేదు. ఇప్పుడు కొత్తగా స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ పేరుతో చేపట్టే పారిశుద్ధ్య కార్యక్రమాలు సైతం ఎక్కడా కానరావడం లేదు. చెత్త రహిత వార్డులు, గ్రామాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలు ఇస్తున్నారు. నిర్వహణ కొరవడి పట్టణం, గ్రామాల్లో రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోతుంది. గతంలో జగనన్న స్వచ్ఛ సంకల్పం పేరుతో ఎన్నో శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించేవారు. వాటికి నేటి ప్రభుత్వం మంగళం పాడింది. గతంలో వైఎస్సార్ సీపీ హయంలో అధికారులు గ్రామాల్లో ప్రత్యేక దృష్టితో చెత్తను నిర్మూలించే వారు. ప్రధానంగా బి.కొండేపాడులలో మీనవిల్లూరు వెళ్లే రోడ్డులో గోడలా చెత్త పేరుకుపోయింది. అదే గ్రామంలో పలు వీధులతో పాటు, ఎస్సీ ప్రాంతాల్లో డ్రెయినేజీలు రోడ్లపై పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షా కాలం మాట అటుంచి వేసవి ప్రారంభంలోనే ఈ దుస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. రాచర్ల నుంచి దర్శిపర్రు వెళ్లే దారిలో చెత్త వల్ల రోడ్డు అధ్వానంగా మారింది. లో లెవెల్ కాలువకు ఆనుకొని ఉన్న గ్రామాల్లో చెత్తను డంపింగ్ యార్డులకు తరలించకుండా మిడ్ లెవెల్ కాలువలో పడేస్తున్నారు. కొండేపాడుతో పాటు, వల్లూరుపల్లి, రాచర్ల ఎస్సీ ప్రాంతాల్లో మురుగునీరు లాగక అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీలు దుర్వాసన వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పలు గ్రామాల్లో తాగునీరు కూడా కలుషితం అవుతోంది. ప్రధానంగా పంట, తాగునీటి కాలువలు ఉన్న గ్రామాల్లో చెత్తను డంపింగ్ యార్డులకు తరలించకుండా కాలువను డంపింగ్ యార్డుగా ఉపయోగిస్తున్నారు. అలంపురం, ప్రత్తిపాడు, రాచర్ల, వల్లూరుపల్లి, దర్శిపర్రు గ్రామాలతో పాటు, జట్లపాలెం మిడ్ లెవెల్ కాలువ ప్రాంతాలలో కె.పెంటపాడు, బిళ్లగుంట ప్రాంతాల్లోని కాలువలో చెత్తను వేయడం వల్ల తాగునీరు కలుషితమవుతోంది. ప్రధానంగా కాలువ కింద ఉన్న గ్రామాల్లో అదే నీటిని చెరువులకు పెట్టుకోవడంతో ఈ సమస్యలు అధికంగా ఉన్నాయి. రాచర్ల, వల్లూరుపల్లి గ్రామాల్లో ప్రధానంగా అత్యధికులు కాలువలో చెత్తను వేస్తున్నారు. దీనిని పంచాయతీలు అడ్డుకోవడం లేదు. ఆయా పంచాయతీలు జరిమానా వేస్తామని తూతూ మంత్రంగా హెచ్చరిక బోర్డులు పెట్టి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ప్రజలు ఆ హెచ్చరికలను లెక్కచేయడం లేదు. తక్షణం ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చెత్తకు నిప్పు పెట్టడంతో..

అధికారుల నుంచి ఒత్తిడి రావడంతో చెత్త కుప్పలకు నిప్పు పెట్టి వదిలి వేయడంతో తడిగా ఉన్న చెత్త కావడంతో దట్టంగా పొగ అలుముకుని స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. రహదారిని అనుకొని ఉన్న గ్రామాల వద్ద చెత్త కుప్పలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. దోమలు విజృంభించి వ్యాధుల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారులను శుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


వల్లూరుపల్లి ప్రధాన వీధిలో అట్టలు కట్టిన మురుగునీరు


రాచర్ల వద్ద మిడ్ లెవెల్ కాలువలో వేసిన చెత్త


రావిపాడు రోడ్డులో రోడ్డు పక్కన చెత్తను డంప్ చేస్తున్న ట్రాక్టర్

ఎస్సీ వర్గీకరణను విరమించాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ప్రయత్నాలు మానుకోవాలని మాల సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పాతూరు అంబేడ్కర్ భవనం వద్ద ఆదివారం మాల సంఘాలు ఆధ్వర్యంలో తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుంపుల సత్యకృష్ణ, విశ్రాంత ఐఆర్ఎస్ సంజీవ్, మెండెం సంతోష్ కుమార్, పొట్ల సురేష్, గొల్లపల్లి అంబేద్కర్, వెన్నపు సుధాకర్, గంజి మధు తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు


నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు గ్రామంలో ఆదివారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్సైలు మురళీ మోహన్, దొరబాబు సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్టు షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి తెలిపారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు


వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ ఉచిత వైద్యాన్ని నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య, డాక్టర్ సుంకవల్లి సీలు మహేంద్ర తణుకు, ఉండ్రాజవరం ప్రాంతాల్లోని ఏడుగురు వృద్ధుల ఇంటికి వెళ్లి వైద్యసేవలందించారు. చెరుకూరి బుల్లబ్బాయి ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకున్న 26వ వార్డుకు చెందిన కడియాల సరోజినికి మందుల ఖర్చుల నిమిత్తం సంస్థ తరపున రూ.2 వేలు ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఉచిత వైద్య సేవలకు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. సంఘ కోశాధికారి అర్జి భాస్కర రావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు


ఉత్సవాల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న నిర్వాహకులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుళ్ల గ్రామంలో పునర్నిర్మించిన కోదండ రామాలయంలో ఈ నెల 10, 11, 12వ తేదీల్లో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు మాకరాజు సతీష్ తెలిపారు. ఆదివారం ఆలయం వద్ద ప్రతిష్ఠా మహోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు విఘ్నేశ్వర పూజలతో మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో ఊడిమూడి నాగరాజు, అప్పికట్ల సుబ్బరాజు, ఉప్పలపు వెంకట్రాజు, మహాశివభట్టు శ్రీనివాసరాజు, మహాశివ భట్టు సత్యనారాయణరాజు పాల్గొన్నారు.


అభివృద్ధి పథంలో మహిళామణులు


మహిళలను సత్కరిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


తాడేపల్లిగూడెం అర్బన్: ప్రపంచానికి శక్తి మహిళలే అని మాజీ ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ కొనియాడారు. నేడు అన్ని రంగాల్లో మహిళామణులు అభివృద్ధి పథంలో ముందంజలో ఉన్నారన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో మహిళలకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ సునీతా విలియమ్స్ అంతరిక్షంలోకి పరిశోధన నిమిత్తం వెళ్లి తొమ్మిది నెలలు అవుతుందన్నారు. ఆమె క్షేమంగా తిరిగిరావాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. నేటి మహిళలు వ్యాపార, సాంకేతిక రంగాలతోపాటు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మహిళలు ఆర్థిక స్వావలంబన చెందాలనే ఉద్దేశ్యంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలు, గృహ నిర్మాణాలకు స్థలాలను మహిళల పేరు మీదనే అందజేశారన్నారు. నేటి కూటమి ప్రభుత్వం మహిళలకు అన్యాయం చేస్తుందని తెలిపారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచినా ఆ దిశగా చర్యలు చేపట్టక పోవడం చంద్రబాబు మాయమాటలకు మరో సారి మహిళలు మోసపోయారని చెప్పారు. ప్రతి కుటుంబానికి సంక్షేమం అందిస్తామని చెప్పిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆ విషయాలపై మాట్లాడకపోవడం ఆయన సినిమా డైలాగులకే పరిమితమని తేటతెల్లమైందన్నారు. సమావేశం అనంతరం ఎంపీపీ, ఎంపీటీసీ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మహిళలను సత్కరించారు. వెంకట్రామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రూపాదేవి, రోహిణి గంగాధర ఫౌండేషన్ చైర్మన్ రాజన్ సుభాషిణి, పెంటపాడు ఎంపీపీ దాసరి హైమావతి, వైఎస్సార్‌సీపీ పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు బోణం విజయనిర్మల, బోశం రామలక్ష్మి, తాడిపర్తి రజని, దిశ ఫౌండేషన్ చైర్మన్ విజయలక్ష్మి, పట్టింపాలెం ఎంపీటీసీ సత్యవతి, నూని అనూరాధ, తదితర మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో ముప్పిడి సంపత్ కుమార్, కొలుకులూరి ధర్మరాజు, బండారు నాగు, చిటికన ప్రసాద్, కనుపూరి ఉదయ భాస్కరాచార్యులు, చెన్నా జనార్ధన్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కల్పతరువు మదనగోపాలుడు

- స్వామి వారి ఉత్సవాలు ప్రారంభం
- కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి
- నేడు స్వామి వారి రథోత్సవం


విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల సెట్టింగ్


విశేష అలంకరణలో మదనగోపాల స్వామి


స్వామి వారి ఉత్సవాలకు సిద్ధమైన వాహనాలు

అత్తిలి: జిల్లాలో వైష్ణవ క్షేత్రాలలో ప్రసిద్ధిగాంచిన అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో వేంచేసియున్న రుక్మిణీ సత్యభామా సమేత మదన గోపాలస్వామి వారి కల్యాణ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని గరుడవాహనంపై, అమ్మవార్లను గజవాహనంపై ఉంచి బాణసంచా కాల్పులతో ఎదురు సన్నాహ ఉత్సవం నిర్వహించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవాలకు హాజరయ్యే వేలాది మంది భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కార్య నిర్వహణాధికారి ఎల్ఎల్ శ్రీనివాస్ చెప్పారు. ఈ నెల 10వ తేదీ తెల్లవారు జామున స్వామి వారి కల్యాణం, ఉదయం తీర్థ మహోత్సవం, అఖండ అన్నసమారాధన, కోలాట భజనలు, మధ్యాహ్నం రథోత్సవం, రాత్రి సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటకం, 11న రాత్రి బ్యాండు మేళాలు, కాంతారా నృత్య ప్రదర్శనలు, బాణసంచా కాల్పులతో స్వామి వారి పొన్నవాహన గ్రామోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వమిస్తామని తెలిపారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

ఆలయ చరిత్ర

భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పతరువుగా ప్రసిద్ధి గాంచిన బల్లిపాడు మదనగోపాల స్వామి వారి ఆలయానికి వందల ఏళ్ల చరిత్ర ఉంది. 1770లో బల్లిపాడు గ్రామస్తులు పనుల నిమిత్తం పాలకొల్లు మండలం పెనుమదం వెళ్లి చెరువు తవ్వుతుండగా మదనగోపాలస్వామి వారి విగ్రహం బయటపడింది. స్వామి వారి విగ్రహాన్ని గ్రామస్తులు బల్లిపాడు తీసుకొచ్చారు. చెరువులో లభించిన స్వామి వారి విగ్రహం తమకు ఇవ్వాలని పెనుమదం గ్రామస్తులు వివాదం చేయగా, బల్లిపాడు గ్రామ పెద్దలు తాము గ్రామంలో స్వామి వారికి ఆలయం నిర్మించి, భూములు ఏర్పాటు చేస్తామని చెప్పి వారిని పంపించారు. దీంతో బల్లిపాడు గ్రామస్తులు ఏకమై స్వామి వారికి 1773లో ఆలయ నిర్మాణం చేశారు. 1901లో గ్రామస్తులచే ధ్వజ స్తంభం ఏర్పాటు చేశారు. 1970లో స్వామి వారి సన్నిధిలో వేంకటేశ్వరస్వామి వారి ఆలయం నిర్మించడంతో స్వామి వారి ఆలయం దివ్య స్థలంగా మారింది. 19వ శతాబ్దం మొదటి భాగంలో ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి వారి ఆలయ ధర్మకర్తలు, అర్చకులకు మధ్య వివాదం వచ్చినపుడు కొంతకాలం వేంకటేశ్వరస్వామి వారికి నిత్యధూప, దీప, నైవేద్యాలకు అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో వేంకటేశ్వరస్వామి వారి అంశ ద్వారకా తిరుమల నుంచి బల్లిపాడు మదన గోపాలస్వామిలో ప్రవేశించిందని ప్రతీతి. ఆ కారణంగానే నిత్య ఆరాధనలో మదనగోపాలస్వామి వారికి నమోవాచకాలు చెబుతూ అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామియే నమః అని సంకల్పం అప్పటి నుంచి చెల్లించుట ఆచారంగా ఉంది.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



మదన గోపాల స్వామి వారి కల్యాణ మహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం. స్వామి వారి రథోత్సవం, పొన్నవాహన గ్రామోత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. ఉత్సవ కమిటీ సభ్యులు, దాతలు, గ్రామస్తుల సహకారంతో కల్యాణ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నాం.

– ఎల్ఎల్ శ్రీనివాస్, ఆలయ కార్య నిర్వహణాధికారి, మదన గోపాలస్వామి దేవస్థానం,